కె.వి.యస్. వర్మ

# నిద్ర



"ఇంకా పడుకోలేదా? అర్ధరాత్రి దాకా పుస్తకాలు చదువుతూ కూచోడమూ, పొద్దుట లేచి నిద్ర సరిపోలేదని గోలెట్టడమూ మీ కలవాటైపోయిం ది. లైటార్పి పడుకోండి."

కాంతం నిద్ర కళ్ళతో ముద్దముద్దగా అని, మళ్ళీ నిద్రలోకి జారిపోయింది. కాంతం వంక చూశాను. దీపం వెలుగులో తను, సూర్యకిరణాలతో స్నానం చే సే సాగర కెరటంలా మెరి "సిపోతోంది. ఆమె రోజూ ఎంతో హాయిగా నిద్ర పోతుంది. ఆమె కంత నిద్ర ఎలా వస్తుందో? ఆడాళ్ళంతా అంతేనే మో?

అమ్మో! ఈ మాట పైకంటే విన్నవాళ్ళు అభివృద్ధి నిరోధకు డంటారు. పేదల గురించీ, ఆడాళ్ళ గురించీ తక్కువగా మాట్లాడితే ఎదగని మనిషికిందే లెక్క. నిజాలు చెప్పినా అంతేనా? ఎవరో ఒక రిద్దరి గురించి చెప్పేటప్పుడు అందరికీ దాన్ని వర్తింపచే స్తే అంతేనట.

మొన్న గోపాలంతో సురేష్ ఆ మాటే అన్నాడు. వా డా మాట ఎందుకన్నాడబ్బా? ఆఁ. స్వప్న వచ్చి, వెంకట్రావును పిలుచుకుని వెళ్ళిపోయింది. స్వప్నా, వెంకట్రావూ ఓ లాడ్జిలో పోలీసులకు దొరికిపోయారట. స్వప్న అచ్చు చండీదా "స 'స్వప్నరాగలీన' లాగే ఉంటుంది. బంగారు రంగు, మెరి సే కళ్ళు. అంత సౌందర్యవతి ఈ తుమ్మమొద్దు వెంకట్రావుతో...ఆమె కళ్ళతో వెంకట్రావును చూడాలేమో! స్వప్నకు ఆఫీసరు హోదా ఉన్న అందమైన మొగుడున్నాడు. వెంకట్రావుకూ పెళ్ళాం, పిల్ల లున్నారు. మరి, ఈ ఏడు పెందుకు? ఒకరంటే మరొకరికి అంత ఇష్టం, లేదా పిచ్చి ఉంటే స్వప్న తన భర్తకూ, వెంకట్రావు తనే భార్యకూ విడాకు లిచ్చే "స పెళ్ళి చేసుకోవచ్చుగా. ఈ దొంగ తిరుగుళ్ళు ఏందుకు?

సంఘంలో ఇల్లాలిగా స్వప్నకు పేరు కావాలి.

వెంకట్రావుకూ మర్యాదస్తుడన్న గౌరవం కావాలి. సామాజిక భద్రత వదులుకోలేరు. సంప్రదాయం తెరచాటున ఏం చేసినా ఫరవాలేదని వాళ్ళ నమ్మకం.

"వెంకట్రావు మగాడు. ఏం చేసినా తప్పు లేదు. స్వప్న? ఆ దొంగ వేషాలే సే ఆడదాన్ని ఏం చేసినా పాపం లేదు. ఈ లోకంలో ఆడాళ్ళంతా ఇంతే గురూ!" అన్నాడు గోపాలం. అప్పుడు సురేష్ చాలా సేపు ఉపన్యాసం ఇచ్చాడు.

టైమ్ ఎంతయిందో? లేచి, గూటి దగ్గరి కెళ్ళి, వాచీ తీసి చూశాను. పన్నెండు గంటలయింది. ఇప్పుడయినా పడుకోవాలి. లైటార్పి మంచ మెక్కాను.

నిద్రపోవాలి—అవును, నిద్రపోవలసిందే—

సురేష్ బలే మాట్లాడతాడు. మాట్లాడటం కూడా ఓ కళే. అతనెంత సేపు మాట్లాడినా వినాలనే ఉంటుంది. ఒకోసారి ఎదుటివాళ్ళు బాధ పడతారని కూడా చూడకుండా మాటల ఈటె లొదిలేస్తాడు. నిన్న గోపాలం, సురేష్ రాసిన లెడ్జర్ బుక్ వెరిఫై చేస్తూ—"నిద్ర మొహంగాడు రూమ్ నుంచి ఇప్పట్లో కదిలేలా లేడు" అన్నాడు—ఆఫీసరును దృష్టిలో పెట్టుకుని. సురేష్ మాట్లాడలేదు. నేను జర్నల్ పుస్తకం నుంచి తలెత్తి చూసి, మళ్ళీ రాసుకోవడం మొదలెట్టాను. ఆ సమయంలో ఎక్కౌంట్స్ డిపార్టుమెంటులో మేం ముగ్గురమే ఉన్నాం. వెంకట్రావు అప్పటికే హాఫ్‌డే లీవ్ పెట్టి స్వప్నతో వెళ్ళిపోయాడు.

"నిద్ర మొహంగాడు ఒక్కడూ గదిలో ఏం చేస్తుంటా డంటావ్? సుశీల ఉంటే తన రూమ్‌కు పిలిపించుకుని హస్కు వేసేవాడు. ఆవిడేమో సెలవులో ఉందాయె!" అన్నాడు గోపాలం.

"గోపాలం. నీ కుక్కబుద్ధి పోనిచ్చుకున్నావ్ కాదు. నీ వేశాలు ఎవరికీ తెలీవనుకుంటావు. ఆఫీసులో అందరికీ నీ సంగతి తెలుసు. నువ్వు మన ఆఫీసరు గురించి మాదగ్గర నానా కూతలూ కూస్తావు. మా మాటలన్నీ రికార్డు చేసుకుని, ఆఫీసరు దగ్గర టేపే సేస్తావు. మా దగ్గర కారుకూతలు కూస్తావు. ఆఫీసరు దగ్గర కెళ్ళి వాడి కాళ్ళు పట్టుకుంటావు. నీ ఏడుపేదో ను వ్వేడుస్తున్నావని మేం ఊరుకుంటున్నాం. మా దగ్గరింకెప్పుడూ ఈ కబుర్లు చెప్పకు" అన్నాడు సురేష్. మాటలు ఘాటైనవే అయినా, అనడం సాఫ్ట్‌గానే అన్నాడు.

"నన్ను అపార్థం చేసుకున్నావ్ గురూ!" అని—"సరే కానీ గురూ. నువ్వు మన యూనియన్‌లో చేరాల్సిందే. ఎప్పుడు అడిగినా చూద్దాం, చూద్దాం అంటున్నావ్. ఇంక వాయిదా వెయ్యడానికి వీల్లేదు" అన్నాడు గోపాలం.

"మీ యూనియన్ మీద నాకు నమ్మకం లేదు. నేను చేరను" అన్నాడు సురేష్—మొహమాట పడితే లాభం లేదనుకుని.

వదలడే—

"అది కాదు గురూ. యూనియన్‌లో చేరితే ఉద్యోగానికి భద్రత ఉంటుంది. మన సమస్యల్ని మనమే పరిష్కరించుకోవచ్చు. ఆలోచించు."

"ఆలోచించడాని కేముంది? మీ యూనియన్ అందరి సమస్యల్నీ పరిష్కరించేది కాదని ఎప్పుడో తేలిపోయింది. కొద్ది మంది ప్రయోజనాలకే అది ఉపయోగపడుతోంది. మీ యూనియన్ వాళ్ళు నెల కో నాలుగు రూపాయల జీతం పెంచమంటారు. అలా ఓ నాలుగు రూపాయల జీతం పెరగగానే, మార్కెట్లోని వస్తువుల ధరలు పెరిగిపోతాయి. చుక్కలంటిన ధరల్ని చూసి మిగతా జనం దిక్కులు చూస్తారు. మీరు మీ గురించే చూసుకుంటారు గానీ, మిగతా వాళ్ళ గురించి పట్టించుకోరు. అయినా మీ బతుకులు మారవు. మీ రెప్పుడూ జీతాలు పెంచమంటారే కానీ, ఒక్కసారైనా ధరల్ని తగ్గించమనీ, కనీసం నిలకడగానయినా ఉంచమనీ డిమాండ్ చేశారా? అలా చేస్తే అంతా కాస్త ఊపిరి తీసుకుంటారు కదా" అని, 'ఏమంటావ్?' అన్నట్టు నాకేసి చూశాడు సురేష్.

"నువ్వు రివిజనిస్టువి" అన్నాడు గోపాలం కోపంగా.

లాభం లేదు. నిద్ర రావడం లేదు. నిద్రపోవాలి. నిద్రపోవడానికి మందు? డాక్టర్‌కి చెబితే కాంపోజ్ వేసుకోమన్నాడు. అయితే, అది అలవాటు కాకుండా చూసుకోమన్నాడు. కాంపోజ్ వేసుకుంటే రెండు రోజులు బాగానే నిద్ర పట్టింది. తరువాత మామూలే మళ్ళీ. డాక్టర్‌కి తిరిగి చెబితే, 'అయితే, మెలకువగా ఉండు, హి హి హి' అని నవ్వు. డాక్టర్ ఫ్రెండ్ అయితే ఇదే ఇబ్బంది. బీర్, విస్కీ—ఇవీ అయ్యాయి. వీటితో రోజూ ఎక్కడ వేగగలం?

మత్తు వదలరా, నిద్దుర మత్తు వదలరా... జీవితమున సగ భాగం నిద్దురకే సరిపోవు, మిగిలిన ఆ సగ భాగం చిత్తశుద్ధి లేకపోవు—చాలు కవిగారూ, చాలు చాలు. నిదురవుచ్చే పాటలు వినిపిద్దురూ! నిదురపోరా తమ్ముడా, నిదురపోరా—నిదురలోన కలతలన్నీ మరచిపోరా—లతా మంగేష్కర్ ఎంత ముద్దుగా పాడింది!

ఆశాభోస్లే లతా చెల్లెలటగా, ఆశాని ఆమే పైకి రానివ్వలేదటగా! 'నేను' ముందు రక్త సంబంధాలూ, స్నేహానుగంధాలూ నీరుకారి పోతాయా?


చిన్నప్పుడే నయం. రాత్రి ఎనిమిదయ్యేటప్పటికి హాయిగా నిద్రపోయేవాణ్ణి. క్లాసు పుస్తకాలు కాసేపు చదివేటప్పటికే నిద్ర ముంచుకొచ్చే సేది. కాలేజీ రోజుల్లో కూడా కొంత నయమే. నిజానికి అప్పుడే తక్కువగా నిద్రపోవడం అలవాటైంది. ఊర్మిళాదేవి నిద్ర...కాంతం ఊర్మిళాదేవి అయ్యుంటుంది. అంటే నేను లక్ష్మణుణ్ణా? విశ్వనాథ బతికుంటే చెప్పును. రామాయణ కల్పవృక్షం ఇప్పు డెవరిక్కావాలి? రామాయణ విషవృక్షమూ ఎవరికీ అక్కర్లేదు.

సరే సరే ఒరన్నా. మరి శ్రీశ్రీయో? ఎప్పటిలానే ఇప్పుడూ అందరికీ కావాలి. అందుకో అందుకో అమరుడ జోహార్లు అందుకో—శ్రీశ్రీ జోహార్లు అందుకో...జనం గుండె మంటల్లో రగులుతున్న నిప్పు నువ్వు...గద్దర్ గళ సౌందర్యం—పోరాట దీక్షాధార!

'మము చంపుకున్నా మీ దయే, మము ఆదుకున్నా మీ దయే' అంటూ కొందరు అడవుల్లో కలిసిపోయారు. 'తప్పు లందరూ చేస్తారు—త్యాగాలు మాత్రం కొందరే చేయగలరు'—ఎంత గొప్ప మాట చెప్పారు గురువుగారూ! గోపాలం లాంటి వాళ్ళు తప్పులు చేస్తూనే ఉంటారు. మరి నాలాంటివాళ్ళో? తప్పులూ చేయరు. త్యాగాలూ చేయరు. తప్పులు చేసేవాళ్ళూ క్రియాశీలురే. త్యాగాలు చేసేవాళ్ళూ క్రియాశీలురే. నాలాంటి వాళ్ళు కర్తలు కాలేరు. అందుచేత కర్మ ఉండదు. క్రియా ఉండదు.

నిద్ర రావడం లేదు. రేపు ఆఫీసులో డ్యూటీ చేయడం ఎలాగో? కునికిపాట్లు పడితే, ఆఫీసరు కంటపడితే చివాట్లు పెడతాడు. గోపాలం మధ్యాహ్నం భోజనం చేశాక, ఓ రెండు ఫైళ్ళు తలకింద పెట్టుకుని డైనింగ్ హాల్లో ఓ గంటన్నా రోజూ నిద్రపోతాడు. వాడిని ఆఫీసరు ఏమీ అనడు. ఎందుచేత? 'అందుచేత' అంటాడు సురేష్-'అందుచేత'ను ఒత్తి పలుకుతూ. గోపాలం అంటే మా చెడ్డ కోపం సురేష్‌కు. అకారణం మాత్రం కాదు కదా!

పోనీ బయట మంచం వేసుకుని పడుకుంటే నిద్ర పడుతుందేమో! నిన్న అదీ చేశాగా? దగ్గు వచ్చేస్తోంది. జలుబు చేసేమో అనుకుంటే, అది కాదట. కాలుష్య ప్రభావమట. పట్నాలు 'మృత్యుగహ్వరాలేనా ఇక! ఫాక్టరీల విసర్జిత జలాలు, వాయువులు కాలుష్యం కోరలు చాస్తున్నాయి. భోపాల్, భోపాల్—మృత్యువు



శాపాల్, శాపాల్...అమెరికా ధనదాహం...వికృత శృంగార పీఠం...ఎయిడ్స్‌తో రాక్‌హడ్సన్ మృతి...ఎయిడ్స్, ఎయిడ్స్...తమిళనాడులో, హైదరాబాద్‌లో, కాశ్మీర్‌లో...భయం, భయం! డబ్బులతో జబ్బులు. డబ్బులేక జబ్బులు. డబ్బు జబ్బు. జబ్బు గబ్బు. డబ్బు ముందు మేథ తబ్బిబ్బు. జేబులలో జబ్బులుంటే దేశ మే గతి బాగువడునోయ్...డబ్బుగలవాడేను మనిషోయ్!

డబ్బుంటే అబ్బురం, నిబ్బరం. అహంకారం. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం—లిబియాపై అమెరికా దాడి. కౌబాయ్ రీగన్. రీ—గన్! శాంతి అతని స్లోగన్. సోవియట్ శాంతి మంత్రం. జెనీవా చర్చలు శిఖరాగ్రంపైనే ఉన్నాయా? ఆయుధాలను అదుపు చేయడానికి దిగిరావా? అంతరిక్షంలోనే ఆయుధ పోటీని తగ్గిస్తారట రీగన్, గొర్బచెవ్‌లు. అంటే, అవనిలో ఆయుధ పోటీ ఆగదనే కదా. 'ఆయుధాలోయ్, ఆయుధాలు. బాబూ ఆయుధాలు కావాలా? అమ్మా ఆయుధాలు కావాలా? డబ్బు తరువాత ఇద్దురుగాని. ఇవిగో ఆయుధాలు. మీ ఇంట్లో కాస్త చోటివ్వండి. మీ కేదన్నా ఆవద వస్తేనే రక్షిస్తాగా!'

అణు యుద్ధం వస్తే మొత్తం ప్రపంచం అంతరించిపోతుంది. పోతే అందరం పోతాం. ఈ కాలుష్యంవల్ల, ఈ కల్తీ ఆహారంవల్ల, ఈ కల్తీ మందులవల్ల, ఈ కరువువల్ల, ఈ ఆకలివల్ల రోజూ చస్తూ బతకడం కంటే అదే మంచిదేమో? ఛఛ. ఈ నిరాశావాదం ప్రగతికి అవరోధం. మరో దారి కనిపించనప్పుడు నిరాశవాదమే ఆశావాదమో? నిరాశలో పడిపోతే, అంతా 'అజంతా'లం అయినా అయిపోతాం. అయ్యప్ప భక్తులమైనా అయిపోతాం. 'అజంతా' దంతా నిరాశావాదమేనా? నిరాశలో ఆశావాదమా?

కళ్ళు మూతలు పడితే ఒట్టు. మంచం దిగి, చీకట్లో తడుముకుంటూ గోడ దగ్గరకు వెళ్ళి స్విచ్ నొక్కాను. లైటు వెలిగింది. కాంతిని కళ్ళు చూలేక పోతున్నాయి. కళ్ళు మండిపోతున్నాయి. వాచీని గూట్లో నుంచి తీసి, టైమ్ చూశాను. నాలుగైంది. లైటార్పి, మళ్ళీ మంచమెక్కాను.

ఇంకో రెండు గంటలకు తెల్లారిపోతుంది. ఇప్పుడైనా నిద్రపోతే తొమ్మిది గంటలకు లేవచ్చు. ఇవో రెండు గంటలు, ఉదయం మరో మూడు గంటలు - అంటే అయిదు గంటలు నిద్రపోవచ్చు. ఆరు గంటల నిద్ర చాలట కదా. ఓ గంట నిద్ర తగ్గినా ఏం కొంప మునిగిపోదు. లెక్కలంటే కాంతికి తలనొప్పి. కుర్ర వెధవకి అన్ని సబ్జక్టుల్లోనూ ఫస్టు మార్కులొస్తున్నాయి. లెక్కల్లో మాత్రం తప్పుతున్నాడు. లెక్కలు వాడి బుర్రకెక్కడం లేదు. ప్రైవేటు పెట్టిస్తే ఏమన్నా ఫలితముంటుందేమో! స్కూల్లో నెలకెంత ఫీజో ప్రైవేట్ మాస్టారికీ అంతే ఇవ్వాలట. లెక్కలంటే లెక్కేమరి!

ఇప్పుడైనా పడుకోకపోతే లాభంలేదు. ఎలాగైనా నిద్రపోవాలి. ఆ మధ్య హిప్నటిజం ప్రోగ్రాం చూశాను కదా. 'నిద్రపో' అంటే అంతా ఇంచక్కా నిద్రపోయారు. నిద్రపోవాలి, నిద్రపోవాలి అనుకుంటే నిద్ర వస్తుందేమో—

నిద్రపోవాలి...నిద్రపోవాలి...ఇప్పుడు నేను నిద్రపోతున్నాను...ఇప్పుడు నేను నిద్రపోతున్నాను...హాయిగా, ప్రశాంతంగా, సుఖంగా నిద్రపోతున్నాను...డీప్।..డీపర్...డీప్...డీపర్...!

అబ్బ, తలపోటు వచ్చేస్తోంది. అనాలజిన్ వాడకూడదట. ఆస్పిరిన్ వాడకూడదట. తలపోటు వచ్చినప్పుడల్లా వాటిని వాడడం ఆరోగ్యానికి మంచిది కాదట. పేపర్లో వేశారు. కాఫీ మంచిది కాదు. టీ మంచిది కాదు. సిగరెట్ మంచిది కాదు. బీర్, విస్కీలు మంచివి కావు. ఏవీ మంచివి కావు. ఎవరూ మంచివాళ్ళు కారు. ఎవరూ...మంచివాళ్ళు కారా? మంచి చెడ్డవాళ్ళు, చెడ్డ మంచివాళ్ళు!

అంతా ఆందోళనకరం. అంతా ప్రమాదకరం. అంతా రామ మయం...పేపర్లో అలానే రాశారు. బ్యాడ్జీలు, బ్యానర్లు, జెండాలు, డోర్‌కర్టెన్లు, కీచైన్‌లు, పెన్ స్టాండ్‌లు, పేపర్ వెయిట్‌లు, గ్రీటింగ్ కార్డులు, పర్సులు, డైరీలు, క్యాలెండర్లు, చొక్కా గుండీలు, ఆడపడుచుల వ్యానిటీ బేగ్‌లు, కుంకుమ బరిణెలు—అంతా అవతార పురుషుని ఫోటోలతో అలరారుతాయట! ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి తెలుగు భారతిని!

అయ్యయ్యో! అప్పుడే వెలుగొచ్చేసింది. తెల్లవారెను కోడికూయకె...ఇంకేం నిద్ర?

"కాంతం. తెల్లారిపోయింది. పాలు తెస్తాను. నువ్వు ముఖం కడుక్కుని రెడీగా ఉండు, కాఫీ పెడుదువుగాని." మంచం మీంచి లేచి, బట్టలేసుకుని పాల డిపోకు వెళ్తూ ఆమెను లేపాను.

డిపోకెళ్తే, ఇంకా తెరవలేదు. అప్పుడే క్యూ, అన్నిటికీ క్యూలే. కిరోసిన్‌కు క్యూ. రేషన్‌కు క్యూ, సినిమాకు క్యూ, నేను కూడా బుద్ధిగా క్యూలో నిలబడ్డాను.

"పాల ధర మళ్ళీ పెంచుతారట. నిజమేనా?" అని అడిగాడు నా వెనకతను.

"నిజమే" అన్నాను.

నిజానికి ధరలు పెరుగుటకే కానీ తరుగుటకు కాదు. ధరలెందుకు పెరుగును? డిమాండ్‌ను బట్టి పెరుగును. లాభముల కోసం పెరుగును. ఇంకనూ ఏ కారణముల వల్ల పెరుగును? ఇంకనూ ఎందువల్ల పెరుగుననగా...మనం చచ్చు దద్దమ్మలగుట వల్ల పెరుగును!

అమ్మయ్య, పాలపేకెట్లు చేతికొచ్చాయి. గబగబా ఇంటికెళ్ళి "కాంతం. త్వరగా కాఫీ పెట్టు, రాత్రంతా నిద్రలేదు" అన్నాను.

"కుక్క మనిషిని కరిస్తే వార్త కాదు. మనిషి కుక్కను కరిస్తేనే వార్త. మీకు నిద్ర పట్టకపోతే వార్త కాదు. మీకు నిద్ర పడితేనే వార్త" అంది కాంతం ముఖం తుడుచుకుంటూ.

"అమ్మా, తల్లీ, నువ్వు జర్నలిజం కోర్సు కొంతకాలం వెలగబెట్టావనీ, మధ్యలో ఆపేసి నన్ను కట్టుకున్నావనీ నాకు బాగా గుర్తుంది. ఇలా నీ తెలివి తేటలు ప్రదర్శించే బదులు, 'అయ్యో, నిద్ర పట్టలేదా? పాపం, ఇవాళ ఆఫీసులో డ్యూటీ ఎలా చేస్తారో ఏవిటో' అని కాస్త సానుభూతి చూపించవచ్చు కదా?" అన్నాను.

"రోజూ ఉండే భాగోతానికి ఏం సానుభూతి చూపను? భోంచేసేటప్పుడూ ఆలోచనే - నడిచేటప్పుడూ ఆలోచనే, ఇలా పనికిరాని ఆలోచనలతో గడిపే వాళ్ళకు నిద్రేం పడుతుంది?" అంది కాంతం స్టౌమీద కాఫీ గిన్నె పెడుతూ.

వాదించబోయి ఆగాను. పెళ్ళాంతో వాదిస్తూ కూచుంటే ఆఫీసుకు లేటైపోనూ? మా ఆఫీసరు మొగుడికి అలుసైపోనూ? నావి పనికిరాని ఆలోచనలు అంటుందా! ఇదేమన్నా చిన్న మాటా? ఈ రాత్రికి దీని గురించి తీవ్రంగా ఆలోచించవలసిందే...!

